## క్లుప్తంగా

### అన్నార్తులకు ఆహారం పంపిణీ



ఆహార పొట్లాలు అందుకున్న వారితో సంస్థ సభ్యులు

**డాబాగార్డెన్స్:** బ్రిక్‌వాల్ డెవలపర్స్ సంస్థ శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నార్తులకు ఆహారం పొట్లాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ గసాడా జెన్నిఫర్, సీఈవో ఏనుగంటి ధనరాజ్ మాట్లాడుతూ ప్రతి వారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మానవ సేవే.. మాధవ సేవగా భావించి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ మూర్తి జేమ్స్, జీవన్‌సూర్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### రహదారి విస్తరణ పనులు ప్రారంభం



మార్కింగ్ పనుల నిమిత్తం పొక్లెయిన్‌తో భవనాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

**డాబాగార్డెన్స్:** పాతనగరంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. కొన్నేళ్లుగా ఉన్న విస్తరణ సమస్య 60 అడుగులకు కటాఫ్ అయింది. భవన యజమానులు సముఖత వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు పనులు మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో 100 అడుగుల విస్తరణకు జీవీఎంసీ ప్రతిపాదనలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విస్తరణలో భవనాలు కోల్పోతున్న యజమానులు సహకరించకపోవడంతో తర్వాత 80 అడుగుల వరకు ప్రతిపాదనలు తయారు చేశారు. అప్పటికీ కొంత మంది భవన యజమానులు కోర్టును ఆశ్రయించారు. చివరికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భవన యజమానుల శ్రేయస్సు కోరుతూ 60 అడుగులకు ఓకే చెప్పడంతో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.

### నేడు భువనేశ్వరీదేవి అధివాసం



భువనేశ్వరీదేవి

**డాబాగార్డెన్స్:** ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సబ్బవరం మండలం చెల్లయ్యపేటలో వెలసిన భువనేశ్వరీదేవికి గాదిచెట్టు పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పంచమి, స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ ఉత్సవం జరపనున్నామని, అమ్మవారికి మంగళ స్నానం చేసి దివ్య పంచామృతాలు, కర్పూరాది సుగంధి గంధాదులతో అలంకరించనున్నట్టు చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని కోరారు.

### దివ్యాంగుడికి ఆశ్రయం



కొత్తవలసలో దీనస్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికుల సహకారంతో తరలిస్తున్న మమత

**అల్లిపురం:** రోడ్డుపై దిక్కుతోచని స్థితిలో ఉన్న ఓ అంధుడికి మమత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎల్లేటి మమత ఆశ్రయం కల్పించారు. విజయనగరం జిల్లా కొత్తవలసలో ఆకలితో రోడ్డు పక్కన పడుకుని ఉన్నాడని స్థానికులు మమత చారిటబుల్ ట్రస్ట్‌కు సమాచారం ఇవ్వడంతో మమత అక్కడికి చేరుకుని అతనిని రక్షించి, సపర్యలు చేశారు. అక్కడి నుంచి పెద వాల్తేరులోని రెడ్‌క్రాస్, జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. తన వివరాలను ఆయన చెప్పలేకపోతున్నారని మమత తెలిపారు.



# ఆటో రిపేర్లకు అడ్డాగా రోడ్లు

- 32వ వార్డులో రహదారుల ఆక్రమణ
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహన చోదకులు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



హరిత లాడ్జి రోడ్డులో ఆటోలు నిలిపేయడంతో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు



సీపీఐ కార్యాలయం వద్ద రోడ్డులో అడ్డదిడ్డంగా పెట్టిన రిపేరు ఆటోలు

**అల్లిపురం:** జీవీఎంసీ 32వ వార్డులోని రహదారులన్నీ ఆటో రిపేరు దుకాణాలకు అడ్డాగా మారిపోయాయి. ఇక్కడ రోడ్లను ఇష్టారాజ్యంగా ఆక్రమించి ఆటో టింకరింగ్, సీట్ కవర్, పెయింటింగ్, వాటర్ సర్వీసింగ్ పనులు బహిరంగంగా చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాదచారులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేరెళ్లకోనేరు హరిత లాడ్జి నుంచి వినాయకుడి గుడి వరకు, గోకుల్ థియేటర్ జంక్షన్ నుంచి ఏడు గుళ్ల స్లమ్ వరకు, సౌత్ జైలురోడ్డు, చావులమదుం జంక్షన్లలో రహదారులకు ఇరువైపులా రిపేరైన ఆటోలతో నిండిపోతున్నాయి. గతంలో జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న రామాంజనేయులు ఇక్కడ వ్యాపారాలు చేస్తున్న వారి దుకాణాలను సీజ్ చేశారు. ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ సహకారంతో రోడ్లపై ఎటువంటి పనులు చేపట్టమని హామీనిచ్చి తిరిగి నెలరోజుల తరువాత దుకాణాలు తెరిచారు. కొద్ది రోజులు సక్రమంగా ఉన్నప్పటికీ తరువాత పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

**ప్రశ్నించిన వారిపై దాడులు..**

నలుగురు నడిచే రహదారిలో ఆటోలు తీయాలని, రోడ్డుపై ఇబ్బందికరంగా టింకరింగ్ పనులు ఏంటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దుకాణదారులు దాడులకు తెగబడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సాయంత్రమైతే చాలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు.

**పట్టించుకోని ట్రాఫిక్, జీవీఎంసీ అధికారులు..**

అల్లిపురం, కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట తదితర ప్రాంతాల ప్రజలు రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఆక్రమణలో చిక్కుకుంది. ఈ రోడ్డుకు ఇరువైపులా మరమ్మతులకు గురైన ఆటోలు బారులు తీరాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేరెళ్లకోనేరు వీధి రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైందని, ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

**నడిచేందుకు దారే లేదు**

నేరెళ్లకోనేరు 3వీధిలో నడవడానికి దారి ఉండటం లేదు. రోడ్డు మొత్తం ఆటోలు పెట్టి పెయింటింగ్, సీట్ కవర్ పనులు చేస్తున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇదేంటని నిర్వాహకులను ప్రశ్నిస్తే.. 'మాకు నచ్చినట్లు చేసుకుంటాం. అడిగితే ఊరుకునేది లేదు' అని హెచ్చరిస్తున్నారు.

– వై.త్రినాథరావు, అల్లిపురం

**చర్యలు తీసుకుంటాం**

క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రహదారులను ఆక్రమించడం నేరం. అలా ఎవరు చేసినా.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించినా వారిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో ఈ ప్రాంతాల్లో పర్యవేక్షించి తగు చర్యలు చేపడతాం.

-కె.శ్రీలక్ష్మి, ఎస్‌ఐ, టూటౌన్ ట్రాఫిక్

## ఏప్రిల్ 9న హెచ్‌ఆర్‌సీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మంత్రి శ్యాంప్రసాద్

**డాబాగార్డెన్స్:** ఏప్రిల్ 9న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్(హెచ్‌ఆర్‌సీ) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భాగంగా మానవ హక్కుల పరిరక్షణలో పౌరుడి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఆహ్వానించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుతో పాటు రాష్ట్ర గవర్నర్‌గా నియమితుడైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మానవ హక్కుల పటిష్టతకు చేపట్టాల్సిన చర్యపై నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై నాటికి 25 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. హక్కుల ఉల్లంఘనతో బాధితులైన వారి హక్కుల పరిరక్షణకు 25 ఏళ్లుగా కౌన్సిల్ పోరాడుతోందన్నారు. బాలలు, మహిళల హక్కులు, పర్యావరణ హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రాజకీయాలకతీతంగా హక్కుల పరిరక్షణకు శ్రమిస్తున్న వారిని మాత్రమే తమ సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. సమావేశంలో వీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీ రమణ, అబ్దుల్ సత్తార్, రావాడ నాయుడు, మాధవి గణపతి, నక్కాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల ముఖాముఖి నేడు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆడారి కిషోర్‌కుమార్

**సీతంపేట:** ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయత వెల్ఫేర్ సొసైటీతో కలిసి మొదటి సారిగా ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థులతో ఓపెన్ డిబేట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుమారు 38 మంది పాల్గొంటారని వెల్లడించారు. వారంతా తమ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఈ చర్చా వేదికపై నుంచి కార్యాచరణ వివరిస్తారన్నారు. ముందుగా కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో జ్ఞానానంద, వెంకటేష్, శ్రీధర్, వంశీ, అసిత పాల్గొన్నారు.

## మల్టీమీడియా సెంటర్ ప్రారంభం



త్రైపాక్షిక ఒప్పందంలో పాల్గొన్న ప్రముఖులు, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు

**డాబాగార్డెన్స్:** కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మధ్య త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా శనివారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన మల్టీమీడియా సెంటర్‌ను కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపు, ఉద్యోగ అవకాశాలపై చర్చించారు. జాయింట్ అప్రెంటిషిప్ అడ్వైజర్ జేమ్స్ రాఫెల్ మాట్లాడుతూ దేశంలో విజయవంతమైన రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సమీర్ నరసాపూర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, పరాగ్ ఓలా మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్, డాక్టర్ పి.అనీల్‌కుమార్, పలు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొణతాల

**డాబాగార్డెన్స్:** బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని కాంగ్రెస్ పార్టీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కొణతాల శ్రీనివాస్ తెలిపారు. ప్రచారానికి చివరి రోజు శనివారం ఆయన జడ్జి కోర్టు సమీపాన గల జ్యోతీరావుపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని అభ్యర్థించారు.

## వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

**మురళీనగర్:** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామికి అభిషేకాల అనంతరం ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**డాబాగార్డెన్స్:** ఉగాది విశిష్ట ప్రతిభారత్న–2023 పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు, పట్టణాల్లో ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఉగాది విశిష్ట ప్రతిభా రత్న పురస్కారంతో ఈ నెల 26న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారు తమ ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్.. గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్లు, ఫొటోలు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఈ నెల 20వ తేదీలోగా సర్వేజనా సుఖినో భవంతు, 1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్–15 చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

## రోడ్డెక్కిన మురుగు నీరు



ద్వారకానగర్ ఆరో లైన్ రోడ్డులో మురుగు నీటి ప్రవాహం

**సీతమ్మధార:** జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ ఆరో లైన్ రహదారిలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకై మురుగు నీరు పొంగిపొర్లుతోంది. రోడ్డెక్కి మురుగు ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. భరించలేని దుర్వాసన వల్ల ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో రెండు రోజులకు ఒకసారి ఈ పరిస్థితి నెలకొంటోంది. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నల్లబ్యాడ్జీలతో విధులకు రెవెన్యూ ఉద్యోగులు

**మహారాణిపేట:** కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది నిరసనలో భాగంగా శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.వి.రమేష్, ఇతర నాయకులు రాజేంద్ర వర్మ, నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### పల్లకీలో జంట.. కనుల పంట



ఓ నవ జంట శనివారం పల్లకీలో ఊరేగుతూ కనువిందు చేసింది. సాధారణంగా పల్లెటూరిలో ఇటువంటి కమనీయ దృశ్యాలు కనిపిస్తాయి. నగరంలోని అప్పుఘర్‌లో బంధుమిత్రుల పరివారంతో పల్లకీలో ఊరేగుతున్న ఈ కొత్త జంటను చూసేందుకు వాహన చోదకులు, స్థానికులు ఉత్సాహం చూపించారు.

- ఎంవీపీ కాలనీ

## సీఎం జగన్‌తోనే బీసీల సంక్షేమం



వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రంధి గోపి తదితరులు

**అల్లిపురం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బీసీల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ అన్నారు. ఈ పదవి వచ్చిన సందర్భంగా ఆయనను వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ ఆధ్వర్యంలో శనివారం బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా సత్కరించారు. కేక్ కట్‌చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మన్యాల మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన సీఎం వైఎస్ జగన్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారు అప్పగించిన బాధ్యతను తూచా తప్పకుండా పాటించి బీసీల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, ఆడారి వెంకట మహేష్, కణితి బ్రహ్మం, భీశెట్టి రాజు, చిన్నమ్ములు, శివ, శ్రీను, నారాయణరెడ్డి, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ నాయకుల సత్కారం..**

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్‌ను టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరి రెడ్డి, మహ్మద్ ఖాన్, శ్రీనివాసరెడ్డి, అయ్యప్పరెడ్డిల ఆధ్వర్యంలో సీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుల్లెట్ రవి, బొండాడ వెంకటరావు, రామిశెట్టి కిరణ్, బోర అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలతో కాసేపు..



లీనా చారిటబుల్ ట్రస్ట్ పిల్లలతో..

**డాబాగార్డెన్స్:** నిత్యం చదువు, పనులతో బిజీబిజీగా గడిపే వారంతా శనివారం అనాథ పిల్లలతో కలిసి ఉల్లాసంగా గడిపారు. ఆట, పాటతో వారిలో ఉత్సాహం నింపారు. మీకు మేమున్నామంటూ భరోసా కల్పించారు. రోటా్రాక్ క్లబ్ వైజాగ్ కపుల్స్ ట్రాక్, సన్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ సహకారంతో నగరంలోని లీనా చారిటబుల్ ట్రస్ట్‌లో శనివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్, భోజనం ఏర్పాటు చేశారు. అంతే కాకుండా 5, 7 లీటర్ల ప్రెజర్‌కుక్కర్లు అందజేశారు. కాసేపు వారితో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో రోటా్రాక్ చైర్‌పర్సన్ ఆర్‌టీఎస్ ఆకాజాస్తి, నిత్య జాస్తి, వీవీఎస్ ప్రవీణ్, ఎస్.శంకర్ పవన్, తోట శ్రీరామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**సింహాచలం:** కుటుంబ గొడవలతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు.... పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన బాడంగి రాజు(24) బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గతేడాది ఏప్రిల్‌లో నగరంలోని డాబాగార్డెన్స్‌కు చెందిన ధనలక్ష్మితో వివాహం జరిగింది. తల్లి, భార్యకు తరచూ గొడవలు జరుగుతుండడంతో వారికి సర్దిచెప్పలేకపోయాడు. ఈ తరుణంలో భార్యతో కలిసి వేరే కాపురం పెట్టాడు. కాగా భార్య ధనలక్ష్మి డెలివరీ కోసం రెండునెలల కిందట పుట్టింటికి వెళ్లింది. అత్త తనను తరచూ వేధింపులకు గురిచేస్తోందని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అప్పటి నుంచి రాజు పనిమానేసి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి పడుకున్న రాజు శనివారం మధ్యాహ్నం 12 గంటలవుతున్నా లేవకపోవడంతో తల్లి అతని ఇంటికి వెళ్లింది. ఎంత పిలిచా పలకకపోవడంతో స్థానికులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరివేసుకుని రాజు ఉన్నాడు. వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న లా అండ్ ఆర్డర్ ఎస్ఐ సురేష్ పరిశీలన చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

## కొనసాగుతున్న కళాకారుల క్రికెట్ టోర్నీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ స్టార్‌మేకర్ సత్యానంద్

**డాబాగార్డెన్స్:** వైజాగ్ ఆర్టిస్ట్స్ క్రికెట్(వ్యాక్ట్), సత్‌గీత్ క్రియేషన్స్, శ్రీవిష్ణు స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సోఫియా జూనియర్ కళాశాల మైదానం వేదికగా కళాకారుల క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. రెండో రోజు శనివారం సెమీఫైనల్స్ పోటీలు జరిగాయి. గణేష్ రథో, రెడ్డెం యాదకుమార్ సారథ్యం వహించిన ఈ కార్యక్రమంలో సినీ స్టార్‌మేకర్ ఎల్.సత్యానంద్, పైడా కృష్ణప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వైజాగ్ రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ఆధ్యాత్మికవేత్త ఎస్.ఫణిస్వామి, భూమాత ఈడీ కిరణ్, సంగీత కళాకారుల గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్ ఖాన్, విశాఖ కళాకారుల సంఘం అధ్యక్షుడు క్యాలు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఫైనల్ పోటీలు**

ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రెడ్‌హిల్స్(నాంచారయ్య), డాల్ఫిన్ దాన్స్(జనార్దన్) జట్ల మధ్య ఫైనల్ పోటీ జరగనుంది.

## బాలిక ఆత్మహత్యాయత్నం

**రక్షించిన పోలీసులు**

**అల్లిపురం:** ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలికను టూటౌన్ పోలీసులు సకాలంలో స్పందించి రక్షించిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టూటౌన్ పరిధిలో మనోరమా థియేటర్ వెనుకవీధిలో నివాసం ఉంటున్న ఓ మహిళ.. పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ డయల్ 112కి శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఫోన్‌చేసి, తన కుమార్తె ఒక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని, ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తుందని చెప్పింది. ఈ మేరకు సమాచారం అందుకున్న నైట్ బీట్ సిబ్బంది టి.జాన్ జయరాజ్, హోంగార్డు వి.శేఖర్, మొబైల్ ఇన్‌చార్జ్ కె.శ్రీనివాసరావుతో కలసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. గది తలుపులు విరగ్గొట్టి బాలికను రక్షించారు.

కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం ఆమెను టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ మహిళా సెల్టర్‌లో చేర్పించారు. సకాలంలో స్పందించి బాలిక ప్రాణాలు కాపాడిన సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అభినందించారు.

## సీతంరాజు గెలుపు కోసం విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న చెన్నా జానకీరామ్

**డాబాగార్డెన్స్:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ శనివారం వార్డు పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు, వార్డు నాయకులు ఆకుల యేసు, కాసారపు వాసు, రెయ్యి డేవిడ్‌రాజు, ఎస్.ఆదిలక్ష్మి, దైవకుమార్, రోజా, రమణి, ఆనంద్, శేఖర్, రామచంద్రరావు, శ్రీను, రమణ, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

## 14న సత్తమ్మతల్లి జాతర

**సింహాచలం:** వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తమ్మతల్లి వార్షిక జాతరను ఈ నెల 14న నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు శనివారం ఒక కార్యక్రమంలో తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన చేస్తున్నట్టు చెప్పారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించామన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు గంట్ల కనకరాజు, బలిరెడ్డి శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.